విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

2, 3 తేదీల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఈ నెల 2, 3 తేదీలలో జిల్లా వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రాజాబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అన్ని పోలింగ్ కేంద్రంలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ శిబిరాలలో సంబంధిత బూత్ స్థాయి అధికారులు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, మార్పులు చేర్పులకు సంబంధించి 6, 7, 8 ఫారాలను అందించడంతోపాటు పూర్తిచేసిన ఫారాలను కూడా స్వీకరిస్తారన్నారు. 17-18 సంవత్సరాలు పైబడిన వారు కొత్త ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఓటర్ల జాబితాలో ఏమైనా అభ్యంతరాలు ఉన్నా కూడా దరఖాస్తులు అందజేయవచ్చన్నారు. ఇదివరకే ఓటర్ కార్డు కలిగిన వారు చేర్పులు, మార్పుల కోసం కూడా బూత్ స్థాయి అధికారులను సంప్రదించవచ్చన్నారు. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేస్తున్న ఈ ఓటర్ల నమోదు ప్రత్యేక శిబిరాలను అందరూ ముఖ్యంగా యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కోరారు.

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ధాన్యం కొనుగోలులో రైతులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆయన స్థానిక విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ హార్వెస్టర్ మిషన్‌తో హార్వెస్ట్ చేసిన రైతులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆందోళనకు గురౌతున్నారని, ధాన్యంలో తేమ 20 శాతం ఉంటే తీసుకోమని ఆర్.బి.కెలో చెబుతున్నారని, 17 శాతం మించి ఉంటే ఒక కేజీ తగ్గించి తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నారని మండలి అన్నారు. బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావంతో రైతులు అందరూ ఆందోళన చెందుతుంటే ఇటువంటి నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం సబబు కాదన్నారు. ధాన్యం ఆరబెట్టుకునే సౌకర్యం లేకుండా 20 శాతం తేమ ఉంటే ధాన్యం ఆరబెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించడం సరికాదన్నారు. కలెక్టర్ నిబంధనలను సడలించాలి, ప్రభుత్వ మద్దతు ధరకే ఎటువంటి షరతులు లేకుండా రైతుల వద్ద ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అన్నారు.

జాతీయ క్రీడాలకు పొట్టి శ్రీరాములు హైస్కూలు విద్యార్థులు

విశాలాంధ్ర - గుడివాడ : జాతీయ క్రీడలకు పొట్టి శ్రీరాములు మున్సిపల్(ఎస్‌పిఎస్)హై స్కూల్ ఖో-ఖో క్రీడాకారులు ఎంపిక అవడం అభినందనీయమని హెచ్‌ఎం టి.ఎం,ఈ రాణి అన్నారు. స్థానిక ఎస్‌పిఎస్ హైస్కూల్లో శుక్రవారం విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వ్యాయం ఉపాధ్యాయుడు మడక ప్రసాద్‌తో కలసి అమె మాట్లాడుతూ ఈ నెల 3వ తేది నుండి 9 వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే అండర్ - 17కు డి. రాకేష్, 12వ తేది నుండి 16 వరకు కర్ణాటకలోని తిప్తుర్‌లో సబ్ జూనియర్ నేషనల్స్‌కు శ్యామ్‌కుమార్, అండర్ 14 జార్కండ్‌లోని రాంచిలో జరిగే ఖో-ఖో చాంపియన్షిప్‌కు దివ్యభాస్కర్, రాష్ట్ర బాలుర జట్టు నుండి ప్రాతినిధ్యం వహిస్తునట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మురలీకృష్ణ, డివైఈఓ పద్మారాణి, జిల్లా ఖో-ఖో సంఘ కార్యదర్శి మద్దినేని సత్యప్రసాద్, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రూ.20 లక్షలతో కుళాయిలు

విశాలాంధ్ర-గూడూరు : మండలంలోని చిట్టిగూడురులో రూ.20 లక్షలతో ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేస్తామని, గ్రామ సచివాలయ పరిధిలో రామరాజుపాలెం, చిట్టి గూడూరు గ్రామాల పరిధిలో 485 మందికి ప్రతి నెల 1వ తేదీన రూ.4.42 కోట్ల పింఛన్లు ఇస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. రామరాజుపాలెం సచివాలయ పరిధిలో శుక్రవారం రామరాజుపాలెం, చిట్టి గూడూరులలో పర్యటించి 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల క్రింద పొందిన లబ్ధి వివరించి, ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తు ఎంతో మంచి చేస్తున్న జగనన్నకు మద్దతు తెలపాలని మంత్రి కోరారు. గ్రామంలో 276 మందికి జగనన్న అమ్మఒడి క్రింద 1.24 కోట్లు, 305 మంది లబ్ధిదారులకు వైయస్సార్ చేయూత పథకంలో 1.35 కోట్లు, 559 మంది సభ్యులకు వైయస్సార్ ఆసరా క్రింద రు.2.30 కోట్లు, రైతు భరోసా క్రింద 372 మంది రైతులకు 1.68 కోట్లు, 240 మంది రైతులకు 14.65 లక్షల ఇన్పుట్ సబ్సిడీ, 168 మందికి జగనన్న విద్యా దీవెన, 146 మందికి జగనన్న వసతి దీవెన, 27 మందికి వాహన మిత్ర, 56 మందికి కాపు నేస్తం తదితర పథకాల కింద నాలుగున్నర ఏళ్ళలో ప్రత్యక్ష నగదు బదిలీ (డిబిటి) కింద సచివాలయ పరిధిలో మొత్తం 13.53 కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చినట్లు మంత్రి తెలిపారు. గడపగడపలో ప్రజలు తమ సమస్యలు మంత్రికి విన్నవించారు. చిట్టి గూడూరు గ్రామంలో ప్రధానంగా తాగునీటి సమస్య పరిష్కరించాలని మంత్రిని కోరగా, జల జీవన్ మిషన్ కింద గ్రామంలో 20 లక్షలతో త్వరలో ప్రతి ఇంటికి కుళాయిలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ సంఘు మధుసూదన్ రావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ తలుపుల వెంకటకృష్ణ, పెడన మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ చారుమతి, ఎంపీడీవో డి సుబ్బారావు, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ తదితర మండల అధికారులు, రామరాజుపాలెం, చిట్టి గూడూరు సర్పంచులు పరస రాజులు, లంక చంద్ర లీల, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై ప్రచారం

విశాలాంధ్ర-మచిలీపట్నం : జిల్లాలో 18-19 సంవత్సరాల వయసు గల యువతీ యువకులను 30 వేల మందిని కొత్త ఓటర్లుగా చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇటీవల కాలంలో ఓటరు నమోదు కార్యక్రమంపై పెద్ద ఎత్తున ప్రచార (స్వీప్)కార్యక్రమాలు చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పులు తొలగింపులు చేయడం జరిగిందని మచిలీపట్నంలో ఓటర్లు వేరొక ప్రదేశానికి వెళ్లినందున అధిక శాతం తొలగింపులు ఉన్నాయన్నారు. మచిలీపట్నం ఓటర్ల జాబితాపై రాష్ట్ర హైకోర్టు కేసుకు సంబంధించి ఈరోల్ అప్డేషన్ ప్రక్రియను సానుకూలంగా పూర్తి చేసామని జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ పి రాజాబాబు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా రాష్ట్ర సచివాలయం 5 వ బ్లాక్ నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఓటరు దరఖాస్తుల పరిష్కారం, యువ ఓటర్ల నమోదు, ముసాయిదా ఓటర్ల జాబితా సవరణ, ఒకే ఇంటిలో పది కంటే మించి ఉన్న ఓట్ల వివరాలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల ఫిర్యాదులు, మీడియా కథనాలు, ఓటరు కార్డుల ముద్రణ-పంపిణీ తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్ నుంచి మాట్లాడుతూ మచిలీపట్నంలో ఓటర్ల జాబితాపై రాష్ట్ర హైకోర్టులో వేసిన కేసుకు సంబంధించి సానుకూల అంశంగా 1140 ఈరోల్ అప్డేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. 30 రోజులు దాటిన ఫారం 6,7, 8లకు సంబంధించి మంచి పురోగతి సాధించామని 572 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ సంవత్సరం ముసాయిదా జాబితా ఓటర్ల జాబితా విడుదలైన అక్టోబర్ 27వ తేదీ నుండి ఇప్పటివరకు వచ్చిన 44,384 దరఖాస్తుల్లో 11,431 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని వాటిని కూడా త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా నుంచి డిఆర్ఓ పెద్ది రోజా, మచిలీపట్నం, గుడివాడ ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి కలెక్టరేట్ సమన్వయ తహసిల్దార్ సురేష్, కలెక్టరేట్ ఏవో రాధిక,డిటి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

కోసూరులో అభివృద్ధి కనపడదా... : ఎమ్మెల్యే కైలే

విశాలాంధ్ర -కూచిపూడి : మొవ్వమండలం కోసూరు గ్రామంలో కోట్లాది రూపాయలతో నిర్వహించిన అభివృద్ధి పనులు టిడిపి నేతలకు కనబడవా?. దమ్ముంటే తనను నేరుగా వచ్చిప్రశ్నించాలని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ సవాల్ విసిరారు. కోసూరు గ్రామంలో శుక్రవారం 33/11 కె.వి విద్యుత్ సబ్ స్టేషన్, సచివాలయ కార్యాలయం, రైతు భరోసా కేంద్రం, ఎస్సీ కమ్యూనిటీ హాల్, బీసీ కమ్యూనిటీ హాల్ లను ప్రారంభించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సర్పంచ్ పెనుమూడి రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, ఎంపీటీసీ డొక్కు భూలక్ష్మి, కృష్ణాజిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు గోగినేని పెరుమాళ్ళు, ఉయ్యూరు ఆర్డిఓ దాసిరాజు, సిడిపిఓపి భానుమతి, వైయస్సార్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, తహసిల్దార్ సిహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి సుధాప్రవీణ్, ఎలక్ట్రికల్ ఈ ఈ భాస్కరరావు, మండల సచివాలయాల కన్వీనర్. సమ్మెట ఆంజనేయులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, కార్యదర్శి ఎం.ఎస్. ఎస్ .మూర్తి, సచివాలయ సిబ్బంది , పలువురు సర్పంచులుఅధికార పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిధులను సత్కరించారు.

పింఛన్లు ప్రజలసొమ్ము : కాగిత

విశాలాంధ్ర-బంటుమిల్లి :- అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇచ్చే ఫెన్షన్లు ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సొంత డబ్బులు కాదని ,ప్రజల సొమ్మని గుర్తుంచుకోవాలని పెడన నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. శుక్రవారం వితంతువులకు వృద్ధులకు కల్లుగీత కార్మికులకు పెన్షన్ రూపేనా ఇచ్చే నెలసరి ఆదాయాన్ని ఈ వైసీపీ ప్రభుత్వం తన సొంత డబ్బులు ఇచ్చినట్టుగా ప్రజాధనాన్ని వారి పార్టీ కార్యకర్తలతోటి పెన్షన్దారులకు ఇవ్వడం సిగ్గుచేటు అని కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. ఈ వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను వీళ్ళ పార్టీ కార్యక్రమాలుగా ఉపయోగించుకుంటూ రాజ్యాంగానికి విరుద్ధంగా పనిచేస్తున్న ఈ వైసీపీ ప్రభుత్వానికి కోర్టుల ద్వారా మొట్టికాయలు వేసినను ఎటువంటి చలనము లేకపోవడం సిగ్గుచేటన్నారు . అసలు మండల వ్యవస్థ గాని మండల అధ్యక్షులుగాని ఎవరైనా ఉన్నారా లేదా అనే అభిప్రాయం ప్రజలకు వస్తుందని, ఎందుచేతనంటే ప్రభుత్వ కార్యక్రమాలు ఏమి చేసినాను ప్రభుత్వ అధికారులు లేకుండా ఈ వైసీపీ కార్యకర్తలు వాలంటీర్ వ్యవస్థను అడ్డంపెట్టుకుని కార్యక్రమాలు చేయటం సిగ్గుచేటని కాగితా అన్నారు ఇప్పటికైనా రాజ్యాంగ వ్యవస్థను కాపాడాలని ప్రభుత్వ ఉద్యోగులకు మర్యాద ఇవ్వాలని కృష్ణా జిల్లా మెజిస్ట్రేట్ గారు అలాగే రాష్ట్రంలో ఉన్నటువంటి ఐఏఎస్ అధికారులు కూడా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని ఇటువంటి పనులు జరగకుండా చూసుకోవాలని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఆ జమైన డబ్బు ప్రభుత్వ ఖజానాకు వెళ్లి ఆ రాష్ట్రంలో ఉన్నటువంటి కార్యక్రమాలకు పేద ప్రజలకు నెలసరి పెన్షన్ రూపేనా వాటిని ఉపయోగిస్తారని ,వాటిని పార్టీ కార్యక్రమాలకు పార్టీ కార్యకర్తల ద్వారా ఇప్పించటం ఈ రాష్ట్రంలో ఇది ఒక విడ్డూరమైన పరిస్థితి అని కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు .ఇటువంటి దుర్మార్గపు చర్యలను ఉన్నత న్యాయస్థానాల దృష్టికి తీసుకువెళ్లాసిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని వివరించారు.

ఎయిడ్స్ ప్రమాదకరం : ఇందిరాదేవి

విశాలాంధ్ర-గుడివాడ : ఎయిడ్స్ ప్రమాదకరమైంది కాదనీ, ఎయిడ్స్ సోకినవారిపై వివక్షత చూపకూడదని ఏరియా అసుపత్రి సూపర్‌డెంట్ ఇందిరాదేవి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా అసుపత్రిలో మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) అధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అసుపత్రి సూపర్‌డెంట్ ఇందిరాదేవి రోగులకు పౌష్టిక ఆహరం అందజేశారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ఎయిడ్స్ గురించి భయపడాల్సింది లేదన్నారు. ముందస్తు నివారణ చర్యలతో ఎయిడ్స్ వ్యాప్తి చెందకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని తీసుకురావదానికీ ప్రతి ఒక్కరూ కృషీ చేయాలన్నారు. మానసికంగా కృంగిపోకుండా స్థైర్యంగా జీవితం సాగించాలనీ కోరారు. ఎయిడ్స్ రోగులకు ఆర్‌కె వారియర్స్ అందిస్తున్న సహకరాన్ని ప్రతి ఒక్కరు గుర్తుపెట్టుకుని సహయ సకారలు అందించాలన్నారు. ఆర్‌కె మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ఆర్‌కె వారియర్స్ అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, ఆర్‌కె వారియర్స్ సభ్యులు షేక్ మీరాషరీఫ్, నూనె అయ్యప్ప, దివిలి సురేష్, చరణ్ తేజ్, గంటఅంజి, శివచరణ్, అసుపత్రి సిబ్బంద.పాల్గొన్నారు.

చట్టం 27/23ను వెంటనే రద్దు చేయాలి : లంకిశెట్టి బాలాజి

విశాలాంధ్ర-కృష్ణా జిల్లా బ్యూరో : న్యాయస్థానాల విస్తృత అధికారాలను, ప్రజల హక్కులను కాలరాచే ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/23 తక్షణమే రద్దు చేయాలని మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీడిమాండ్ చేశారు. శుక్రవారం మచిలీపట్నంలో విలేకరులతో మాట్లాడుతూ కక్షిదారులు యొక్క ఆస్తులు సంబంధించి సివిల్ కేసులను సివిల్ కోర్టులో దాఖలు చేయకుండా కోర్టు పరిధిని తీసివేస్తూ, సివిల్ తగాదాలు ఉన్న భూములు పై విచారించే హక్కును అధికారులకు కట్టబెట్టే ఈ చీకటి చట్టం పట్ల దోపిడీకి అవకాశం ఏర్పడుతుందని బాలాజీ అన్నారు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ లేకుండా ఏకపక్షంగా జారీ చేసిన చీకటి జీవో 27/23ను అని, రాజకీయ పార్టీలు వ్యతిరేకించాలని బాలాజీ పిలుపునిచ్చారు. అధికారులకు రాజ్యాంగ వ్యతిరేక అధికారాలను కట్టబెడితే ఏ పార్టీ అధికారం ఉంటే ఆ పార్టీ ప్రజల ఆస్తులను దోచుకోవడానికి అవకాశం ఏర్పడుతుందని బాలాజీ అన్నారు. ఇప్పటికే అనంతపురం పశ్చిమగోదావరి జిల్లా తూర్పుగోదావరి జిల్లాలో బార్ అసోసియేషన్లు రాబోయే వారం రోజుల్లో నిరసన కార్యక్రమాలకి పిలుపు ఇవ్వడం జరిగిందని కృష్ణాజిల్లాలో కూడా ఈ ఉద్యమానికి న్యాయవాదుల సిద్ధమవుతున్నారని బాలాజీ తెలిపారు. తక్షణమే యాక్ట్ ను రద్దు పరచాలని సివిల్ కోర్టుకు ఉన్న హక్కులకు భంగం కలగకుండా ప్రజల యొక్క చట్టపరమైన, రాజ్యాంగపరమైన హక్కులను హరించి వేసే చట్టానికి ఫుల్ స్టాప్ పెట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రిని బాలాజీ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక చట్టాలను, చీకటి చట్టాలను ప్రజాస్వామివాదులందరూ వ్యతిరేకించాలని బాలాజీ అన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన, అప్రమత్తత అవసరం

విశాలాంధ్ర-పమిడిముక్కల: హెచ్ఐవి ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని దీనివల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డా,, అఖిల అన్నారు.శుక్రవారం వీరంకిలాకు, కపిలేశ్వరపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డా,, అఖిల మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పై అవగాహన కలిగివుండాలని ఎయిడ్స్ రోగుల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాలని అన్నారు.ఎయిడ్స్ వ్యాధి ఒకప్పుడు ప్రాణాంతకమైనప్పటికీ, దీనిని నియంత్రించే మందులు ఉన్నందున ప్రమాదం లేదని వ్యాధి సోకితే శరీరంలో రోగనిరోధక శక్తి తగ్గించి తద్వారా అనేక రుగ్మతలకు కారణమౌతున్న వ్యాధి పట్ల ఎవరికి వారే వ్యక్తిగత జాగ్రత్తలు పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ కురికలిన్, సిబ్బంది కృష్ణమోహన్ ఆశావర్కర్లు ఎ.ఎన్.యం.లు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు : జెడ్పీటీసీ అన్నవరపు

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం మండలం పురుషోత్త పట్నం గ్రామంలో పొలం బడి కర్యక్రమంలో రైతులు ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారానే ఆమ్ముకోవాలని మంచి గిట్టు బాటు ధర ప్రభుత్వం ప్రకటించిందని గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజా బెత్ రాణి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కేంద్రాలు పెట్టీ రైతులకు పెట్టుబడి క్రింద ప్రతి ఏటా ఆర్థిక సహాయం మరియు విత్తనాలు,ఎరువులు పురుగు మందులు,సాగునీరు,అందించటంలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా చేసిందని అన్నారు. రైతులు ధాన్యం అమ్మిన రైతుల బ్యాంక్ అకౌంట్లో డబ్బులు 21రోజులలో నేరుగా వేస్తారని అల జరగని పక్షంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ని సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతు గ్రామ పెద్దా యం సాంభశివరావు అధ్యక్షత వహించారు.వైయస్ ప్రసిడెంట్ కె శివయ్య,ఏ ఏ బి చైర్మన్ రాజా ఏ ఓ ఎన్ తేజస్వి ఏ డి ఏ సునీల్ తదితరులు పాల్గొన్నారు

గురువిందగుంటలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని గురువింద గుంట గ్రామంలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం రెండవ రోజు జరిగినట్లు ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ గ్రామ నాయకులు గంజి వెంకటరత్నం, పిట్టు సురేష్, నాగదేసి దమయంతి రాజు, చిరువోలు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

8న సర్వసభ్య సమావేశం : ఎంపీడీవో

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఈనెల 8వ తేదీన స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరుగుతున్నందున మండలంలోని అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరవ్వాలని ఎంపీడీవో టీ సీతామహాలక్ష్మి ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు.

సీరం బ్రదర్స్‌కు మాతృవియోగం

విశాలాంధ్ర-పెడన : పెడన మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి సీరం.ప్రసాద్‌కు మాతృవియోగం అయింది. ఎస్పి పల్లి మాజీ సర్పంచ్ సీరం. శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆమెకు నలుగురు సంతానం. ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ సీరం. సురేష్ ఈమెకు మరో కుమారుడు. పెడన నియోజవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ వెంకటేశ్వరమ్మ మృతికి ఘన నివాళులర్పించారు. నివాళులు అర్పించిన వారిలో శలపాటి. వీర ప్రసాద్, కూనపరెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజవరకు కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర-కూచిపూడి : ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో పండించిన ధాన్యం పంటను చివరి గింజల వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సివిల్ సప్లైస్ ఇన్చార్జి డిఎం గానున్న ఉయ్యూరు డివిజన్ రెవిన్యూ అధికారి దాసిరాజు హామీ ఇచ్చారు. ఇదే విషయాన్నిపామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ రైతులకు స్పష్టం చేశారు మొవ్వ మండలంలోని కోసూరులో శుక్రవారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన రోడ్లపై గల ధాన్యం బస్తాలను పరిశీలించి రైతులతో మమేకమై మాట్లాడారు. గత ఏడాదిలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ ఏడాది రైతులకు ఏ విధమైన ఇబ్బందులు రాకుండా ముందుగానే సంచులు పంపిణీ చేస్తున్నామని అలాగే రైతు భరోసా కేంద్రాలలో ఈ కేవైసీ నమోదు చేసుకున్న రైతులకు ఆన్లైన్ ద్వారా కేటాయించిన రైస్ మిల్లులకు నేరుగా తరలించేందుకే ప్రభుత్వంఅవకాశాలు కల్పించిందని వెల్లడించారు. కామన్ రకం, గ్రేడ్ ఏ రకం లకు ప్రకటించిన మద్దతు ధర తోనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారని, కొనుగోలు కేంద్రాలలో ఏ విధమైన ఇబ్బందులు వస్తే నేరుగాతన దృష్టికి తీసుకురావాలని, పేర్కొంటూ రైతులను ఏ విధమైన ఇబ్బందులు పెట్టవద్దని డిఎంకు తానుతెలియపరిచానని ఆయన పేర్కొన్నారు. కాగాఈఏడాది లొకేషన్ గుర్తింపుమూలంగా ధాన్యం సరఫరాలో ఏర్పడుతున్న జాప్యంపై రైతులు ఆయన దృష్టికి తెచ్చినట్టు సమాచారం. వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు కూడా వరికోతలు చేసుకోవాలని వివరించారు. ఒకవైపు వాహనాల కొరత మరొకవైపు అన్లోడ్ చేసిన ధాన్యంతో నిండిపోయిన మిల్లుల మూలంగా రైతులు ఓపిక పట్టాలని హితవుపలికారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమమే లక్ష్యం : నగేష్

విశాలాంధ్ర-బంటుమిల్లి :- పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం కృష్ణా మిల్క్ యూనియన్ అహర్నిశలు కృషి చేస్తూ అందగనిలుస్తుందని యూనియన్ డైరెక్టర్, పెడన మండల జడ్పిటిసి అర్జ వెంకట నగేష్ అన్నారు. గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం పరిధిలోని పెందురు గ్రామ పాలఉత్పత్తిదారుల సహయ సహకార పరపతి సంఘం నందు పాలు పోస్తున్న మారుబోయిన నాగేంద్ర కుమార్ కుమార్తె వివాహం సందర్భంగా శుక్రవారం కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ అర్జ వెంకట నగేష్ చెతులమీదుగా యునియన్ ప్రవేశపెట్టిన కళ్యాణమస్తు పథకం కింద 20 వేల రూపాయలు ఖరీదు చేసే బంగారు నాణాన్ని నవదంపతులకు అందజేశారు .ఈ సందర్భాంగా నగేష్ మాట్లడుతూ కృష్ణామిల్క్‌కు పాలఉత్పత్తిని అందిస్తున్న పాలఉత్పత్తిదారుల కష్టాల్లో పాలు పంచుకుంటూ వారికి కృష్ణామిల్క్ యూనియన్ అండగా నిలుస్తుందన్నారు. యూనియన్ పాడి రైతులకు అందించే ధర వ్యత్యాసం, కళ్యాణమస్తు,క్షీరబంధు,ప్రతిభా, ఆక్సిడెంట్ కేర్ ట్రస్ట్ పథకాల గురించి మరియు పాడి పశువులకు అందించే పశు భీమా, డీ వార్మింగ్ ,పశు దాణా,కాల్షియం,మినరల్ మిక్సర్ వాడటం వలన కలిగే ప్రయోజనాలను పాడి రైతులకు తెలియజేశారు. యూనియన్ వారు అందించే సెమెన్ ద్వారా పుట్టిన దూడలు మాత్రమే భవిష్యత్ లో ఎక్కువ పాల చార గలిగిన పశువులు గా రైతులకి అధిక లాభాలు ఆర్జించగలవని తెలిపారు. ఈ కార్యక్రమం లో గుడ్లవల్లేరు పాల శీతల కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ,సూపర్వైజర్ చొప్పకట్ల వర ప్రసాద్ ,సంఘాధ్యక్షులు బోయిన ప్రసాద్ పాలకవర్గ సభ్యులు ,పాలఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల అభ్యున్నతికి పెద్దపీట : నాగకుమారి

విశాలాంధ్ర-పెడన: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి డ్వాక్రా మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తున్నారని పెడన మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ కొనియాడారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మెప్మా అర్బన్ మహిళ మార్కెట్ ను మున్సిపల్ చైర్ పర్సన్ కటకం నాగకుమారి ప్రసాద్ ప్రారంభించారు. డ్వాక్రా మహిళలు విక్రయించేందుకు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించి వారికి పలు సూచనలు చేశారు. అనంతరం జరిగిన సభలో చైర్ పర్సన్ కటకం మాట్లాడుతూ స్వశక్తితో ఎదిగి ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా డ్వాక్రా మహిళ సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ విశేష కృషి చేస్తున్నారని తెలిపారు. పట్టణ ప్రజలందరూ డ్వాక్రా అర్బన్ మార్కెట్ ను సందర్శించి వారికి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెడన టౌన్ సచివాలయాల కన్వీనర్ మతిన్ ఖాన్, మెప్మా టిఎంసి భీమేశ్వరరావు, మెప్మా సీసీ వెంకటేశ్వరరావు, మెప్మా సి. ఓ.టి శ్రీనివాస్,అనురాధ, మెప్మా సిబ్బంది డ్వాక్రా ఆర్ పి లు, పట్టణ సమాఖ్య లీడర్లు, డ్వాక్రా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సాకులు చెప్పి పింఛన్ల ఎత్తివేత : దింట్యాల

విశాలాంధ్ర - గుడివాడ : నవరత్నల పేరిట ప్రభుత్వం ఇప్పటికే ఒక చైతితో పెట్టి 2చైతీతో తీసి వేయడం ఇప్పటీ వరకు చూశామాని నేడు ప్రభుత్వం కొత్త పెన్షన్ పొందలంటే అనేక సాకులు చెప్పాడం విడురంగ ఉందని టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు అవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్లు సమావేశంలో అయన మాట్లాడుతూ ఇప్పటికే పెన్షన్ విషయంలో రూ.3వేలు ఇస్తామాని జగన్ ప్రభుత్వం ప్రకటించి 4సం॥ 6నెలలో విడతల వారిగా రూ2750 మాత్రమే ఇచ్చి నవర్నతలో ఒక రత్నం రాలిపోయిందన్నారు. ఏడాదిలో నూతన పెన్షలు ఇస్తామని నేటికి కొత్త పెన్షలు ఇచ్చిన దాఖాలు లేవన్నారు. నేడు కొత్త పెన్షన్ కావలంటే అస్తి పన్ను రసీద్, కరంట్ బిల్లు ఇస్తేనే పెన్షన్ వస్తుందని చెప్పాడం హస్యస్పందగా ఉందన్నారు. వైసిపి ప్రభుత్వం ఇప్పటికే దివాల తీసే విధంగా ఉందని ప్రజలు అర్థం చేసుకోవలన్నారు. వెంటనే నూతన పెన్సన్‌కు పెట్టిన నిభందనలు ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు మజ్జాడ నాగరాజు, రామదేణ్ వెణుబాబు, ఆదినారాయణ, దేవధి నాగేశ్వరరావు, పెద్ది వీరబద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

85 శాతం పింఛన్లు పంపిణీ

విశాలాంధ్ర-కూచిపూడి : వైయస్సార్ ఫెంక్షన్ కానుక తొలిరోజైన శుక్రవారం 85% వరకు పంపిణీలు జరిగాయి. ప్రతినెల తొలి రోజు పంపిణీ 90 నుంచి 92 శాతం వరకు ఉండగా ఈనెలలో మధ్యాహ్నం సుమారు ఒంటిగంట నుంచి ఆధార్ సర్వరు ఫెయిల్ అవ్వడంతో పంపిణీలుతాత్కాలికంగా నిలిచాయి. సాయంత్రం నాలుగు గంటలు దాటిన తర్వాత సమయంలోతిరిగి పనిచేయటం ప్రారంభించినట్లు సమాచారం. దీంతో తొలిరోజు పంపిణీ శాతం తగ్గింది .ఇదే విషయాన్ని అధికార వర్గాలు తెలిపాయి. మండలంలో 8,778 మందికి పెన్షన్లు పంపిణీ కాగా మధ్యాహ్నం 12 గంటలకు 5,780 మందికి మాత్రమే పంపిణీ చేసినట్టు సమాచారం.!!. కూచిపూడి సచివాలయంలో వైద్య చికిత్సలు పొందుతున్న రోగి తమన్న కుటుంబరావుకి వాలంటీర్ సక్కారవి తొలిరోజే వెళ్లి పింఛన్ పంపిణీ చేయడం గమనార్హం.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వవి ఎస్ ఆర్ ప్రభుత్వం డిగ్రీ మరియు పీజీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం కార్యక్రమాన్ని రెడ్ క్లబ్ కోఆర్డినేటర్ఎం.నాగ పరమేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు.. ఈ సందర్భంగాకళాశాల లో విద్యార్థిని విద్యార్థులకు పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అలాగే రంగోలి మానవహారం నిర్వహించి వ్యాసరచన పోటీలు నిర్వహించి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేర్ మంజుల,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏం అనిల్ కుమార్, నాక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎల్.వి. కృష్ణారావు, ఎన్సిసి కోఆర్డినేటర్ డాక్టర్ రజనీకాంత్,ఎమ్మెస్ ప్రసాద్ మరియు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

ప్రకటన

నా క్లయింటు కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం, బాపులపాడు గ్రామ కాపురస్థురాలైన సువర్ణ చంద్రహాస్ గారి కుమారుడు దొండపాటి సాల్మన్ రాజు గారు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా:

నా క్లయింటు తండ్రి గారైన దొండపాటి సువర్ణ చంద్రహాస్ గారికి బాపులపాడు గ్రామం నందు ఆర్.యస్.నెం.133/2 కు దాఖలా య.0.10లు నివేశ స్థలమును గూడవల్లి మధుసూదనరావు గారి కుమారుడు రంగారావు గారి వద్ద క్రయము పొంది దస్తావేజు నెం.1428/1988 గా ... సబ్-రిజిస్ట్రార్ వారి కార్యాలయములో రిజిష్టర్ చేయించియున్నారు. సదరు ఒరిజినల్ క్రయ దస్తావేజు మరియు బి.ఎస్.సి (Reg.No.11522) Nagarjuna University 1995 మరియు బి.ఇడి (Reg No.546) Andhra University 1987 ఒరిజినల్ డిగ్రీ పత్రాలు మరియు నా క్లయింటు తండ్రి గారైన దొండపాటి సువర్ణ చంద్రహాస్ గారు దీ.14-11-1995 న వ్రాయించి ఇచ్చిన Unregistered Will ఒరిజినల్ ను ... Unregistered Will ఒరిజినల్ ను ... ఈ తెలియపర్చుటతో తగిన పారితోషకం ఇవ్వబడును.

ఇట్లు సిహెచ్. అంజయ్య, న్యాయవాది
డోర్ నెం.8/86/1, గన్నవరం గ్రామం & మండలం, కృష్ణా జిల్లా. సెల్: 8985670762
ప్రదేశం: గన్నవరం
తేది:30-11-2023

కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర-మైలవరం : ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని శుక్రవారం జిల్లాలో సీపీఐ నాయకులు సచివాలయాల ఎదుట ధర్నాలు చేసి వినతిపత్రాలు సమర్పించారు. ఎన్టీఆర్ జిల్లాలో 40 శాతం మంది వ్యవసాయమే జీవనాధారంగా జీవనాన్ని కొనసాగిస్తున్నారని, ఖరీఫ్‌లో జిల్లాలో సాధారణ వర్షపాతం 732.32 శాతంగా నమోదు కావల్సి ఉండగా కేవలం 614.41 మిల్లి మీటర్లు మాత్రమే నమోదైందని, ఆగస్ట్ ,సెప్టెంబర్ ,అక్టోబర్ నెలల్లో అసలు వర్షమే పడక జిల్లాలో సాధారణ వర్షపాతం కన్నా చాలా తక్కువ వర్షపాతం నమోదైందని, జిల్లాలో దుర్భిక్షం ఏర్పడ్డాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని శుక్రవారం ఆయన సీపీఐ జిల్లా సమితి పిలుపు మేరకు మైలవరం గ్రామసచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో గంపలగూడెం, తిరువూరు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించారని, వాటికన్నా అతితక్కువ వర్షపాతం గల మండలాలను కరువు మండలాలుగా ప్రకటించకపోవటం చాలా బాధాకరం అని అన్నారు. జిల్లాలో ఎక్కువ ఆయకట్టు, వర్షాధారం, చెరువులపై ఆధారపడి మరికొంత నాగార్జున సాగర్ ఎడమకాలువ కింద ఆధారపడి పంటలు పండిస్తున్నారని, దానికి తోడు ఈ ఈఏడాది నాగార్జునసాగర్‌లో నీళ్ళు లేకపోవడంతో దిగువ ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడిందని, దీంతో కాల్వలపై ఆధారపడే సుమారు 2 లక్షల ఎకరాల పంటనష్టం వాటిల్లిందని, చింతలపూడి ఎత్తిపోతల పథకం, మరియు వేదాద్రి ఎత్తిపోతల పథకం కూడా అసంపూర్తిగానే వదిలేశారని, మునేరుపై ఆనకట్ట కూడా ఆధునీకరణకు నోచుకోలేదని, అందువలన 1.50 లక్షల ఎకరాల్లో వరిసేద్యం కావాల్సి ఉంటే కేవలము లక్ష ఎకరాల్లో మాత్రమే సాగుకాగా ఎకొండూరు మండలంలోని గొల్లమండలలో ఎండిపోతున్న పంటను పశువుల మేతకు వదిలేసే పరిస్థితి అని, మొక్కజొన్న, మిరప, మొదలగు పంటలైతే నీటి కొరత వలన బొబ్బర తెగులు ఏర్పడి 50 శాతం పంట కూడా దిగుబడి రాని స్థితిలో ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ మైలవరం మండల కార్యదర్శి బుద్దారపు వెంకట్రావు మాట్లాడుతూ ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లో సీపీఐ జిల్లా పార్టీ, రైతు, కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో జగ్గయపేట, నందిగామ, మైలవరం, తిరువూరు, నియోజకవర్గ పరిధిలోని అనేక మండలాల్లోని పంటనష్టం వాటిల్లిన గ్రామాల్లో పంటను సందర్శించి రైతులతో మాట్లాడి వారికి కల్గిన నష్టానికి తగిన నష్ట పరిహారం చెల్లించే వరకు ఉద్యమం కొనసాగిస్తూ బాధిత రైతుల పక్షాన ఉంటామని వెంటనే ప్రభుత్వం స్పందించి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలు కరువు మండలాలుగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీపీఐ నాయకులు కే సీతయ్య, ఎస్ తిరుపతిరెడ్డి, కే నాగరాజు, బొజ్జగాని శివ, రూటురాజ్ రెడ్డి, మేడేపల్లి వినయ్, తదితరులు పాల్గొన్నారు.

మైలవరం నియోజకవర్గంలో అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి

విశాలాంధ్ర-మైలవరం (జి కొండూరు): మైలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి, మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా జిల్లా సమితి పిలుపులో భాగంగా శుక్రవారం జికొండూరు మండలంలోని కవులూరు గ్రామ సచివాలయ సహాయ కార్యదర్శి దివ్యకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దనేకుల శ్రీనివాసరావు, సీపీఐ కవులూరు గ్రామ కార్యదర్శి బివి సుబ్బారావు, సీపీఐ సీనియర్ నాయకులు గరిమెళ్ళ శ్రీరామూర్తి, జి సూర్యనారాయణ, జి.ప్రభాకరరావు, డి సుబ్బారావు, జి సాంబశివరావు, జి.రవి తదితరులు పాల్గొన్నారు.

కరువుతో అల్లాడుతున్న రైతాంగాన్ని ఆదుకోండి

విశాలాంధ్ర-ఎ కొండూరు : సాధారణంగా వర్షాలు అధికంగా పడతాయని నమ్మి రైతులు, కౌవులు రైతులు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి ఖర్చుపెట్టి పంటలు సాగుచేస్తే వరుణుడు కరుణించక వర్షాలు కురవక తక్కువగా వర్షాలు పడ్డాయని, నీరులేక వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని ఎండిపోయాయని ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాలని సీపీఐ ఏ.కొండూరు మండల కార్యదర్శి మేకల డేవిడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీపీఐ ఎన్టీఆర్ జిల్లా సమితి రెండురోజులపాటు గ్రామవార్డు సచివాలయాల వద్ద ధర్నాకు జిల్లాని కరువు జిల్లాగా ప్రకటించాలని, పిలుపులో భాగంగా ఎ. కొండూరు మండలంలో మండల కమిటీ ఆధ్వర్యంలో చీమలపాడు, రామచంద్రాపురం, కృష్ణారావు పాలెం, ఏకొండూరు తండా, కుమ్మరికుంట్ల సచివాలయాల వద్ద రైతులతో

కలిసి ధర్నా చేసి అనంతరం కార్యదర్శికి వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రాలు అందించారు. ఈ ధర్నా కార్యక్రమంలో పాల్గొని డేవిడ్ మాట్లాడుతూ బ్యాంక్ నుండి తీసుకున్న రుణాలు రద్దుచేయాలని. తిరిగి రుణాలు మంజూరు చేయాలని సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి పంటల నష్ట పరిహారం వారికే ఇవ్వాలని అలాగే వ్యవసాయ పనులులేని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి, రూ.600 కూలి ఇచ్చి 200 రోజులు పనిదినాలు కల్పించి వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని అయన కోరారు. రైతులకు రబీలో సీజన్లో అవసరమైన ఎరువులు విత్తనాలు పురుగుమందులు. పంటరుణాలు ప్రభుత్వమే అందించాలని కరువుతో అల్లాడుతున్న గ్రామీణ పేదలకు పెన్షన్లు.ఆరు నెలలపాటు నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవాలని డేవిడ్ రాష్ట్ర పభుత్వానికి విజ్ఞప్తి చేసారు. పంటల భీమా పథకం అమలుచేసి రైతులను కౌలు రైతులను సన్న, చిన్నకారు రైతులను ఆదుకుని వ్యవసాయాన్ని కాపాడాలని అయన కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతులు లేళ్ళ రమేష్, పి.శ్రీనివాసరావు, తిరుపతయ్య, ఎమ్ శివకృష్ణ రాములు, కె కృష్ణ, జి జోజిబాబు, ఎమ్ మోషే, మల్లూరి సత్యనారాయణ (పెదబాబు), ఎస్. కోటేశ్వరరావు, పి సుబ్బారావు, ఎస్కె కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

విశాలాంధ్ర-నందిగామ: రైతులు, కౌవులు రైతులు వేలాది రూపాయలు అప్పులు తెచ్చి ఖర్చుపెట్టి పంటలు సాగుచేస్తే వరుణుడు కరుణించక వర్షాలు కురవక తక్కువగా వర్షాలు పడ్డాయని నీరులేక వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిని ఎండిపోయాయ నీ ఈ పరిస్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు పుల్లిడి నాగభూషణం డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాట్లాడుతూ బ్యాంక్ నుండి తీసుకున్న రుణాలు రద్దు చేయాలని తిరిగి రుణాలు మంజూరు చేయాలని సాగుదారులైన కౌలు రైతులను గుర్తించి పంటల నష్ట పరిహారం వారికే ఇవ్వాలని అలాగే వ్యవసాయ పనులులేని గ్రామాలలో ఉపాధి పనులు కల్పించి.అరువందల రూపాయలు కూలి ఇచ్చి రెండువందల రోజులు పనిదినాలు కల్పించి వ్యవసాయ. కూలీలను ఆదుకోవాలని అయన కోరారు. రైతులకు రబీ సీజన్లో అవసరమైన ఎరువులు విత్తనాలు పురుగుమందులు. పంటరుణాలు ప్రభుత్వమే అందించాలని కరువుతో అల్లాడుతున్న గ్రామీణ పేదలకు పెన్షన్లు. ఆరు నెలలపాటు నిత్యావసర వస్తువులు అందించి ఆదుకోవాలని రాష్ట్ర పభుత్వానికి విజ్ఞప్తి చేసారు. పంటల భీమా పథకం అమలుచేసి రైతులను కౌలు రైతులను సన్న, సిన్న కారు రైతులను ఆదుకొని వ్యవ సాయాన్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏటూరు తుర్లపాడు గ్రామాల్లో స్థానిక రైతులతో కలసి ఎన్టీఆర్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని గ్రామ సచివాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మన్నే హనుమంత రావు, షేక్ బాబు, కంభంపల్లిగిరి, పోలినేడి వెంకటరావు, ముసలయ్య తదితరులు పాల్గొన్నారు.

కరవు మండలంగా ప్రకటించాలి

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: ఎన్టీఆర్ జిల్లాను కరవు మండలంగా ప్రకటించాలని విస్సన్నపేట మండలంలోని కలగర, విస్సన్నపే-1,3 సచివాలయాల వద్ద సీపీఐ శ్రేణులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశాయి. తొలుత కలగరలో జరిగిన సభలో నియోజకవర్గ కార్యదర్శి షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా పంటల భీమా పథకం అమలు చేయాలని, ప్రతి కూలీకి రోజుకు రూ.600ల వేతనంతో 200 పనిదినాలుగా ఉపాధిహామీ పనులు చేపట్టి, వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా 440 మండలాల్లో కరవు విలయతాండవం చేస్తుంటే, ప్రభుత్వం కేవలం రెండు మండలాలను కరవు మండదలాలుగా ప్రకటించి చేతులు దులుపుకోవటం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మహిళాసమాఖ్య వర్కింగ్ అధ్యక్షురాలు మేకల కుమారి, నాయకులు సిహెచ్.చెన్నారావు, గోదా దుర్గమ్మ, కె.నాగమల్లేశ్వరరావు, ఎం.చెన్నకేశవులు, రంగారావు, శైలజ తదితరులు పాల్గొన్నారు.

విస్సన్నపేటలో కొనసాగిన నిరసన

విస్సన్నపేట పట్టణంలోని 1,3 సచివాలయాల వద్ద జిల్లా సమితి పిలుపు మేరకు మండల కార్యదర్శి ఎం.త్యాగరాజు, షేక్ నాగుల్‌మీరా శుక్రవారం నిరసన ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఇప్పటికే పెద్దఎత్తున పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేసిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. ఆహార పంటలకు ఎకరాకు రూ.50వేలు, ఉద్యాన పంటలకు రూ.75వేలు, వాణిజ్య పంటలకు రూ.లక్ష నష్టపరిహారంగా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వారితోపాటు గంజాల నాంచారయ్య, పతకమూడి నాగేశ్వరరావు, మేడా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

3 నుంచి భవానీ దీక్షా విరమణలు

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ ఢిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అధికారులు సమన్వయంతో వ్యవహరిస్తూ బృంద స్ఫూర్తితో భవానీ భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆధ్యాత్మిక వాతావరణంలో భవానీ దీక్షా విరమణలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో భవానీ దీక్షా విరమణలకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై శుక్రవారం దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, వైద్య, ఆరోగ్య, అగ్నిమాపక, నగరపాలక సంస్థ, విద్యుత్, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మత్స్యశాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ నవంబర్ 23 నుంచి 27 వరకు అమ్మవారి మండల దీక్షలు, అదేవిధంగా డిసెంబర్ 13 నుంచి 17వ తేదీ వరకు అర్ధమండల దీక్షలు భక్తులు తీసుకుంటారని వివరించారు. జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు భవానీ దీక్షా విరమణలు ఉంటాయని.. రోజుకు సుమారు 50 వేల నుంచి లక్షలోపు భవానీ భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారన్నారు. చివరి రెండు రోజుల్లో దాదాపు లక్ష నుంచి లక్షా 50 వేల మంది భవానీ భక్తులు రానున్న దృష్ట్యా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. డిసెంబర్ 26వ తేదీన సాయంత్రం 6.30 గంటల నుంచి కలశజ్యోతి ఉత్సవం జరుగుతుందని.. ఈ ఉత్సవానికి దాదాపు 10 వేల మంది జ్యోతులు తీసుకొని ఆలయానికి చేరుకునే అవకాశమున్నందున తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దసరా ఉత్సవాలలోను విజయవంతం చేసిన తరహాలో భవానీ దీక్షా విరమణల కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. క్యూ మార్గంలో వాటర్ ప్రూఫ్ షామియానాలు, కోయిర్ మ్యాట్లు, తాత్కాలిక విద్యుత్ అలంకరణ, తాగునీరు తదితర ఏర్పాట్లు చేయాలన్నారు.పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ద్వారా భక్తులకు నిరంతరం సూచనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో కేఎస్ రామారావు, జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్‌కుమార్, సబ్ కలెక్టర్ అదితిసింగ్, ఆలయ ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమ, ఏఈవోలు పి.చంద్రశేఖర్, ఎస్.రమేష్, పి.సుధాకర్, జంగం శ్రీనివాస్, సూపరింటెండెంట్లు వై.హేమదుర్గ, ఇరిగేషన్ ఈఈ కృష్ణారావు, మత్స్యశాఖ ఏడీ చక్రాణి తదితరులతో పాటు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రధానం-మేయర్

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : నగర ప్రజల సంక్షేమం, అభివృద్ధే ప్రధానమని నగర మేయర్ ఆర్.భాగ్యలక్ష్మి అన్నారు. మేయర్ శుక్రవారం 46వ డివిజన్ 141 వ సచివాలయంలో వైఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం, పల్లెకు పోదాం కార్యక్రమంలో పాల్గొని సంక్షేమ బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి 141 సచివాలయం పరిధిలో సుమారు రూ.16 కోట్లు లబ్ధిదారులకు చేకూర్చటం జరిగిందన్నారు. ప్రతి ఒక్క సచివాలయంలో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని చూపించటం అనేది నిబద్ధత కూడిన పాలనకి నిదర్శనమన్నారు. అనంతరం 46వ డివిజన్‌లోని భీమన్నవారిపేటలో గంగానమ్మ సత్రం సెంటర్ వద్ద కలవర్టు మారమ్మతులు, వాటర్ ట్యాంక్, మెటీరియల్ ట్రాన్స్‌పోర్ట్ ఎస్కెలేటర్ నిర్మాణం పనులను పరిశీలించారు. గత ప్రభుత్వంలో రెండు రోడ్లుకు కల్వర్టు కట్టినప్పటికీ దాని కనెక్షన్ సరిగా ఇవ్వకపోవటంతో కొండ ప్రాంతం కావటం వల్ల వర్షం నీరు, ఇళ్ల వాటకపు నీరు పైనుంచి కిందకి వచ్చేటప్పుడు ప్రజలంతా ఇబ్బంది పడుతున్నారన్నారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్య రాకుండా ఉండేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ద్వారా వెళ్లి పోయేలా నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో రాష్ట్రం : ఎమ్మెల్యే రక్షణనిధి

విశాలాంధ్ర-ఎ కొండూరు : రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృధి పథంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నడిపిస్తున్నారని తిరువూరు నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిలి గడ్డ రక్షణ నిధి అన్నారు. ఎ కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో జరిగిన పల్లెకు పోదాం కార్యక్రమంలో శుక్రవారం ఎమ్మెల్యే రక్షణ నిధి ముఖ్య అతిథిగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం లో అభివృధి సంక్షేమం విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాజీ లేని పోరాటం చేస్తున్నారని తన సుదీర్ఘ పాద యాత్ర లో పేద మధ్యతరగతి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులను చూసి ప్రతి ఒక్క విద్యార్థికి ఉన్నత మైన విద్యను అందించే విధంగా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నూతన విద్య విధానం తీసుకు వచ్చిన నేత మన జగన్ అన్న అని అర్హులు ఐన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డు దగ్గర నుంచి పెన్షన్ వరకు అర్హులు ఐన ప్రతీ ఒక్కరికీ అందిచడం మే లక్ష్యంగ సచివాలయ వాలంటరీ వ్యవస్థలను తీసుకువచ్చిన ఘనత మన ముఖ్యమంత్రి కే చెల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి చెన్నారావు సర్పంచ్ కోట పుల్లమ్మ ఎంపీటీసీ కోట పుల్లారావు జడ్పిటిసి భూక్య గనియ దాసరి సతీష్ ఎమ్. సాంబశివరావు జి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ట్రైసైకిల్ పంపిణీ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన. కోట కసయ్యకు మండల పరిషత్ అధ్యక్షులు మార్కపుడి గాంధీ ట్రై సైకిల్‌ని లబ్దిదారుడికి పంపిణీ చేశారు. గతంలో కసయ్యకు తప్పకుండా ట్రైసై కిల్ ఇపిస్తానని మాట ఇచ్చారు. అలాగే మాట నిలుపుకున్నారని కసయ్య సంతోషం వ్యక్తం పరిశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ. వుట్ల నాగమణి, ఎంపీడీఓ శ్రీ సాయి హర్ష, మండల పరిషత్ ఏ వో కె.సిద్ధారెడ్డి, అనిగండ్లపాడు సర్పంచ్ జ్యోతి బ్రహ్మం. మండల వైసిపి పార్టీ అధ్యక్షులు కనకపూ డి.భాస్కరరావు , ఎంపీటీసీ కె లోకేష్ , ఎస్ సి సెల్ నాయకులు బెజవాడ శ్రీనివాసరరావు., సొసైటి అధ్యక్షులు పిరికిడి కోటేశ్వరావు, వైసిపి నాయకులు కొత్తపల్లి పెంట య్య.అనిగండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు గుంజి ప్రసాదు. తదితరులు పాల్గొన్నారు.

'మిచాంగ్'పై రైల్వే శాఖ అప్రమత్తం : జీఎం



విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : తరుముకు వస్తున్న "మిచాంగ్" సైక్లోనిక్ తుఫాను పరిస్థితి దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు.దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ అర్. ధనంజయులు సమీక్ష సమావేశంలో తుఫాను పరిస్థితుల దృష్ట్యా పాటించాల్సిన జాగ్రత్తలపై విజయవాడ, గుంటూరు,గుంతకల్లు డివిజన్లతో వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్‌తో సమావేశం నిర్వహించారు. రైలు కార్యకలాపాలకు భద్రత కల్పించేందుకు అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు.దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. పలు ప్రదేశాలలో తుఫాను పరిస్థితులు ఎదురుకునేందుకు అని సమాన్లు ముందస్తుగా అమార్చుకోవాలని సూచించారు. నిరంతర పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని రైల్వే అధికారులకు సూచించారు. తూఫాను గమనాన్ని ఎప్పటికప్పుడు గమనిస్తూ తక్షణ చర్యలకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రభావితమయ్యే సెక్షన్లలో మాన్సూన్ పెట్రోలింగ్ చేపట్టవలసిందని సూచించారు. బ్రిడ్జీల దగ్గర,ఇతర ప్రభావిత ప్రదేశాలలో వాచ్‌మెన్‌లను నియమించాలన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైలు ప్రయాణికులు తమ రైలు ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని అభ్యర్థించారు. అలాగే వారి ప్రయాణాన్ని చేపట్టే ముందు రైళ్ళు నడుస్తున్న వాస్తవ స్థితి గురించి రైల్వే అధికారుల నుండి తెలుసుకోవచ్చు.ఈ కాలంలో ఏదైనా రైలు సంబంధిత విచారణ కోసం, ప్రయాణికులు సమీపంలోని రైల్వే స్టేషన్‌లోని అధికారులను సంప్రదించాలని కోరారు.

డూప్లికేట్, డబుల్ ఎంట్రీ ఓట్లు తొలగించండి: కొండ్రగుంట

విశాలాంధ్ర-వీరులపాడు: మండలంలోని ఓటర్ల జాబితాలో పలు డూప్లికేట్ మరియు డబల్ ఎంట్రీ ఓట్లు ఉన్నాయని, వాటిని పరిశీలన చేసి సరైన ఓట్లను ఉంచి మిగిలిన ఓట్లను తొలగించవలసిందిగా కోరుతూ శుక్రవారం వీరులుపాడు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొండ్రగుంట శ్రీనివాస్ కుమార్, తెలుగుదేశం సీనియర్ పార్టీ నాయకులు కాపా రాంబాబు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలతో కలిసి జుజ్జూరు గ్రామంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం నందు డిప్యూటీ తహశీల్దార్ ఆంజనేయులు కి వినతిపత్రం అందజేశారు. అభ్యర్ధనలను పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని డి.టీ తెలిపారు.

IN THE COURT OF THE HONORABLE XI ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL KRISHNA AT GUDIVADA

I.A. No. 1116 / 2019 IN M.V.O.P. No. 409 / 2010

Between:
M/s. United India Insurance Co. Ltd., Rep. by its Manager - **Petitioner**
And
Kandula Chinna Kumari and 6 others - **Respondents**

Notice

To
1. **G.Kondala Rao,** S/o. Venkateswararao, Hindu, aged about 45 years, driver, R/o. Patamata, Vijayawada, Krishna now NTR district. **(R6)**
2. **K.Bhaskara Navaneetha Krishna Rao,** S/o. Narayanarao, Hindu, aged not known, Business, R/o. Agiripalli Village and Mandal, Krishna District now Eluru Dist. **(R7)**

Please take notice that the Petitioner filed the above number petition against **1 to 7** respondents and the said matter is posted to **04-12-2023** for your appearance. Hence you may appear before the said court on **04-12-2023 at 10:30 am** by person or through Advocate, otherwise the case will be set exparte against you and the case will be decided in your absence.

//By order of the court//

Boddula Bala Subrahmanyam,
M.B.A., L.L.B.
Advocate, Gudivada.

ప్రకటన

నా క్లయింటుస్నా, విజయవాడ, అయోధ్యనగర్ ఏరియా, శాంతినగర్, డోర్ నెం: 20-4-19, కాపురస్తులు అయిన యడ్ల నాగేంద్రబాబు, తండ్రి యడ్ల లేటు నాగేశ్వరరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... విజయవాడ, అయోధ్యనగర్ ఏరియా, పైన ఉదహరించిన డోర్ నెంబరు నందు సర్వే నెం: 98, 99, 103/1ల్లు లే-అవుట్ నెం:27/84, ప్లాటు నెం:10 దాఖలా 80 చ.గ.ల గల భూమిని విజయవాడ మండల రెవిన్యూ అధికారి వారు మా తల్లిగారు అయిన యడ్ల వేణుబాయి గారి పేరు మీద ఇంటి స్థలం మంజూరు చేయు నిమిత్తం ఉత్తర్వులు ఇచ్చియుండగా ఆ స్థలమునకు మా స్వాధీనములో గల మరికొంత అస్తి వెరశి చ.గ. 165లు స్థలము మా తల్లిగారికి సంక్రమించిన దరిమిలా అందు గ్రౌండు, ఫస్టు, సెకండు ఫ్లోరుగా గల ఆర్.సి.సి. బిల్డింగు నిర్మించుకొని సర్వ హక్కులతో అనుభవించుచూ ఎట్టి లిఖిత పూర్వక ఏర్పాట్లును జరపకుండా ది. 20-01-2020వ తేదీన స్వర్గస్థులైనారు. దరిమిలా మా తండ్రిగారైన యడ్ల నాగేశ్వరరావు గారు కూడా ది.11-03-2022వ తేదీన స్వర్గస్థులైనారు. వారిరువురి మరణానంతరం ముఖ్య వారసుల మయిన నేను, శ్రీ కృష్ణపుష్కరేంద్రబాబు, యడ్ల శ్రీనివాస్ జితేంద్రబాబు, సదరాస్తిని స్వాధీన పరచుకొని మా యొక్క సర్వసంపూర్ణ హక్కుభుక్తములతో నిర్వివాదముగా అనుభవించుచూ యుండియున్నాము. ఈ క్రమములో నా తల్లిగారికి మంజూరు చేసిన ఒరిజినల్ ఇంటి నివేశన స్థల పట్టా, డెత్ సర్టిఫికెట్టు, నా తండ్రిగారి డెత్ సర్టిఫికెట్టు, నా ఆధార్ కార్డులను జిరాక్సు నిమిత్తం ఒక కవరులో పెట్టుకొని ది. 27-11-2023వ తేదీన ఉదయం 10.00గం.ల సమయములో నా మిత్రుడు అయిన జెర్రి హరిప్రసాద్ రెడ్డితో బండి నెం: ఏపి 27యన్ 7361 పై అయోధ్యనగర్ మెయిన్ రోడ్డు మీద ఉన్న జిరాక్సు షాపు వద్దకు వెళ్ళినపుడు, జిరాక్సు తీసుకున్న తరువాత ఇంటికి వెళ్ళి చూసుకొనగా సదరు పై దస్తావేజుల కవరు కనబడలేదు. అదే దారిలో గత నాలుగు రోజుల నుంచి పలుమార్లు వెతికి చుట్టుప్రక్కల వారిని వాకబు చేసినా కూడా కనపడియుండలేదు. సదరు దస్తావేజుల కవరు ఎవరికైననూ దొరికిన యెడల అజిత్‌సింగ్‌నగర్ పోలీస్ స్టేషన్ నందు గానీ పైన తెలుపబడిన నా క్లయింటు అడ్రస్సు నందు గానీ ఈ ప్రకటన యిచ్చిన 7 రోజులలోపు తెలియపర్చగలరు. పైన పేర్కొన్న దస్తావేజుకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిపినా మేము తీసుకొను చట్టపరమైన క్రిమినల్, సివిల్ చర్యలకు బాధ్యులుగుదురు.

ఒగ్గు గవాస్కర్, ఒగ్గు సుజాత, న్యాయవాదులు
డోర్ నెం.20-3/1-31/1, న్యూ అయోధ్యనగర్,
విజయవాడ-3. ఫోన్: 9248144399
విజయవాడ ది.01-12-2023

ప్రకటన

మా క్లయింటు అయిన ప్రకాశం జిల్లా, కొరిశపాడు మండలం, బొడ్డువానిపాలెం గ్రామ కాపురస్తులు ఆలపాటి రామయ్య గారి కుమారుడు ఆలపాటి శ్రీనివాసరావు గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా... మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని ఎన్‌టిఆర్ జిల్లా, జి.కొండూరు మండలం, ఆత్కూరు గ్రామ కాపురస్తురాలు గుత్తా వెంకటేశ్వరరావు గారి భార్య గుత్తా కృష్ణకుమారి గారి నుండి క్రయము పొందుటకు లోగడనే ఒప్పందము చేసుకొని యున్నారు. కావున ఎవరికైననూ ఏ విధమైన క్లయిములు, తనఖాలు, కోర్టు వ్యవహారములు, భాగలబ్ధ తగాయిదాలు మరి ఏ విధమైన లావాదేవీలు వున్న యెడల ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల లోగా తగిన ఆధారములతో లిఖిత పూర్వకముగా రిజిస్టర్ పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాకు తిరుగు రశీదు ద్వారా పంపగలరు. గడువులోపు ఏ విధమైన అభ్యంతరములు రానియెడల షెడ్యూలు దాఖలా ఆస్తిని నిర్వివాద ఆస్తిగా భావించి మా క్లయింటు పేరున గానీ, వారు కోరిన వారి పేరున గానీ రిజిస్ట్రేషన్ పొందగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములు మా క్లయింటును గానీ షెడ్యూలు ఆస్తిగానీ బైండు చేయజాలవు. **షెడ్యూలు:** లోగడ కృష్ణాజిల్లా, ప్రస్తుతం ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రిజిస్ట్రేషన్ జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామ పంచాయితీ ఏరియాలో చేరిన గొల్లపూడి గ్రామ రీ.సర్వే నెం.465/1సి దాఖలా య.0.50 సెంట్ల భూమి దాఖలా ప్లాట్ నెం.30రు దాఖలా చ.గ. 200.22 లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలమునకు **హద్దులు: తూర్పు:** ప్లాట్ నెం.3రు దాఖలా అస్తి, **దక్షిణం:** ప్లాట్ నెం.29రు దాఖలా అస్తి, **పడమర:** అ.33-00లు వెడల్పు గల దారి, **ఉత్తరం:** ప్లాట్ నెం.31ఎ, 31బి ల్లు దాఖలా అస్తి. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ.200-22లు లేక చ.మీ. 167-409ల్లు స్థిరాస్తి నివేశన స్థలము అందుగల యావత్ ఈజిమెంట్ హక్కులతో సహా.

కునుకు రాజశేఖర్, న్యాయవాది
కునుకు గంగయ్య వీధి, గాంధీనగర్,
విజయవాడ స్విమ్మింగ్ పూల్ వద్ద, విజయవాడ-3.
ది.1-12-2023 సెల్: 9392164499

IN THE COURT OF THE XII ADDL. DISTRICT AND SESSIONS JUDGE (FTC) VIJAYAWADA
I.P. No.72/2022

Between:
Mohammad Abdul Hafeez .... Plaintiff
AND
Shaik Faiz Ahamad ... Defendant
To,
Shaik Faiz Ahamad, S/o. Shaik Salar Sharieff, R/o. D.No.7-6-63, 2nd Floor, Mahanthipuram, Kothapet, Vijayawada-1.

పై నెంబరు దావాలోని ప్రతివాది అయిన మీకు మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టు వారు ఎన్నిసార్లు సమన్లు పంపిననూ తీసుకో నక కాలయాపన చేయు చున్నందున ఈ నోటీసు ద్వారా మీరు పై కోర్టు వారి ఎదుట ది.15-12-2023న ఉదయం గం.10.30 ని.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకు గల అక్షేపణలు తెలుపు కొనవలెను. లేనియెడల మీకు పరోక్షములో తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
వాయిదా తేది: 15-12-2023
సుంకర రాజేంద్రప్రసాద్, న్యాయవాది
విజయవాడ.

IN THE COURT OF THE 2nd ADDL. SENIOUR CIVIL JUDGE COURT AT VIJAYAWADA
I.P. No.72/2022

Between:
Bokka Suguna Rao .... Petitioner
AND
Marapaka Adam & 10 others ... Respondents
To,
R-6: Bokka Murali, S/o. Sundara Rao, D.No.11-93A, Near CSI Church, Gollapudi, Vijayawada Rural.

పై నెంబరు ఐ.పి.లో 6వ ప్రతివాది అయిన మీ అవసరార్థమై పైన కోర్టులో ది.15-12-2023కి వాయిదా అయి వున్నది. కావున ఆ రోజు ఉదయం గం.10.30 ని.లకు మీరు స్వయంగా గానీ, న్యాయవాది గారి ద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల మీకు పరోక్షములో తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు ///
వాయిదా తేది: 15-12-2023
వై.వి. కిషోర్‌బాబు, అడ్వకేట్
విజయవాడ. సెల్: 9848880789

అవగాహనతోనే ఎయిడ్స్ నిర్మూలన : డాక్టర్ సమరం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వైద్యులు, ఐఎంఏ జాతీయ మాజీ అధ్యక్షులు డాక్టర్ జీ సమరం అన్నారు. దానికి అవసరమైన అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహనా సదస్సును శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ సమరం మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా ఎయిడ్స్ మహమ్మారి ప్రపంచాన్ని పట్టిపీడిస్తుందన్నారు. ఆఫ్రికా వంటి ప్రాంతాల్లో ఎయిడ్స్ వ్యాధి చాలా దారుణాలను సృష్టించిందన్నారు. భారతదేశంలో ఎయిడ్స్ ప్రభావంతో లక్షలాది మంది ఈ వ్యాధి బారినపడి జీవితాలను కోల్పోయారన్నారు. యువత దీనిపై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. హెచ్ఐవీ సోకిన తరువాత వెంటనే దాని ఉనికి రక్తపరీక్షల్లో కనపడదన్నారు. మూడు దశల్లో వ్యాధి తీవ్రత పెరుగుతుందన్నారు. కలిసి జీవించటం ద్వారా వ్యాధి వ్యాప్తి ఉండదన్నారు. కేవలం రక్తమార్పిడి, లైంగిక చర్యలతోనే ఈ వ్యాధి వ్యాప్తి ఉంటుందన్నారు. ప్రస్తుతం ఎయిడ్స్ వ్యాధి తీవ్రతను శరీరంలో తగ్గించటానికి అనేక మందులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా వ్యాధి వచ్చిన తరువాత సైతం సుదీర్ఘకాలం జీవించి ఉన్నవారున్నారన్నారు. ప్రపంచ వ్యాపితంగా ఇప్పటి వరకూ ఎనిమిది కోట్ల మంది ఈ వ్యాధి బారిన పడ్డారన్నారు. దేశంలో ప్రస్తుతం 23 లక్షల మంది ఈ వ్యాధి బారిన పడిన వారున్నారని చెప్పారు. సౌతాఫ్రికా వంటి దేశాల్లో ఇంకా దాని తీవ్రత దారుణంగా ఉందన్నారు. ప్రభుత్వం ఇతర సంస్థలు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల ద్వారా దేశంలో 0.2 శాతం మాత్రమే ఉందన్నారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం విద్యార్థులు పాటుపడాలన్నారు. కేబీఎన్ కళాశాల అనేక సామాజిక చైతన్యవంతమైన కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. మూడు దశాబ్దాలుగా కేబీఎన్ కళాశాలతో అనుబంధముందని వివరించారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి వలన సమాజం తీవ్రంగా ప్రభావితమవుతుందన్నారు. వ్యాధి సోకిన వ్యక్తి కుటుంబం ఆర్థిక సమస్యలతో సతమతమై చాలా ఇక్కట్లపాలైన సంఘటనలు అనేకం ఉన్నాయన్నారు. ఎయిడ్స్‌వ్యాధిపై అవగాహన పెంచుకోవటం ద్వారా ఈ విధమైన వ్యాధులకు దూరంగా ఉండవచ్చని చెప్పారు. అనంతరం డాక్టర్ సమరం పవర్‌పాయింట్ ప్రెజంటేషన్‌ద్వారా పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్రావు, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ టీ భాగ్య కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎన్ సాంబశివరావు, డీ పవన్‌కుమార్, రెడ్ రిబ్బన్ క్లబ్ కన్వీనర్ అలీబాషా తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సమాజంలో ఎయిడ్స్ వ్యాధి లేకుండా కృషి చేయాలని దుర్గాపురం మున్సిపాల్ హెల్త్ సెంటర్ డాక్టర్ గౌతమ్ అన్నారు. శుక్రవారం బీఆర్‌టీఎస్ వాకర్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గౌతమ్ మాట్లాడుతూ ఎయిడ్స్ పై అవగాహన ఉంటే ఆ వ్యాధి నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. వ్యాధిని అరికట్టేందుకు ప్రతీ ఒక్కరిలో అవగాహన కల్పించి చైతన్యవంతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడ్స్ వ్యాధి నివారణ ప్రభుత్వం,స్వచ్ఛంధ సంస్థలు చేస్తున్న విస్తృతంగా ప్రచార కారణంగా ఎయిడ్స్ వ్యాధి బాధితుల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టిందన్నారు. మనం సమాజం నుంచి ఎయిడ్స్ వ్యాధిని దూరం చేయాలే తప్ప వ్యాధి గ్రస్తులను కాదన్నారు. ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు గుర్రం ఏడుకొండలు, కార్యదర్శి కొండాయగుంట రాము, కోశాధికారి డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, పోతుల విల్సన్‌రాజు, పసుపులేటి రమేష్, పి.సాయి, హెల్త్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్ బ్యాంక్ ఇండియా, వీసా, అమెజాన్‌లతో గోద్రెజ్ క్యాపిటల్ నిర్మాణ్ భాగస్వామ్యం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): గోద్రెజ్ బ్రాండ్‌పై భారతీయ వినియోగదారుల విశ్వాసంతో 'నేషన్ బిల్డింగ్' అనే సిద్ధాంతంతో ముందుకు వెళ్తున్న గోద్రెజ్ క్యాపిటల్, దాని భాగస్వామ్య నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించడం ద్వారా తన నిర్మాణ్ ప్లాట్‌ఫారమ్‌పై పెద్ద ఎత్తున అంచనాలు పెట్టుకుంది. డీబీఎస్ బ్యాంక్ ఇండియా, వీసా, అమెజాన్ తదితర పరిశ్రమల ప్రముఖులతో భాగస్వామ్యాలు ఎంఎస్ఎంఈ యజమానులకు వృద్ధి అవకాశాలను అందించడంలో గోద్రెజ్ క్యాపిటల్ నిబద్ధతను నొక్కి చెబుతున్నాయి. ఈ భాగస్వామ్యాలు ఎంఎస్ఎంఈలను బలోపేతం చేయడానికి రూపొందించబడ్డాయి. వారి వ్యాపార ప్రయాణంలో విభిన్నమైన విలువ ఆధారిత సేవలు, సమగ్ర మద్దతును అందిస్తాయి. దాని నిబద్ధతకు నిదర్శనంగా, భారతీయ ఆర్థిక సేవల రంగం యొక్క డైనమిక్ ల్యాండ్‌స్కేప్‌లో ఎంఎస్ఎంఈల వృద్ధికి చురుగ్గా దోహదపడే దృష్టితో 13కు పైగా భాగస్వాములను చేర్చడానికి నిర్మాణ్ తన సహకార నమూనాను విస్తరించింది.

యాక్సిస్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): భారతదేశంలో పెరుగుతున్న తయారీ థీమ్ సామర్థ్యాన్ని ఉపయోగించుకునే ప్రయత్నంలో, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఫండ్ హౌస్‌లలో ఒకటైన యాక్సిస్ మ్యూచువల్ ఫండ్, యాక్సిస్ ఇండియా మాన్యుఫ్యాక్చరింగ్ ఫండ్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. తాజా ఆఫర్ భారతదేశ తయారీ థీమ్‌ను సూచించే ఓపెన్-ఎండ్ ఈక్విటీ పథకం. నిఫ్టీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ టీఆర్ఐకి అనుగుణంగా బెంచ్‌మార్క్ చేయబడుతుంది. ఈనెల 1వ తేదీన ఎన్ఎఫ్ఓ తెరవబడుతుంది. రాబోయే సంవత్సరాల్లో వృద్ధి చెందుతుందని భావిస్తున్న భారతదేశ తయారీ థీమ్ సామర్థ్యాన్ని పెట్టుబడిదారులకు అందించడం లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్ఎఫ్ఓ ఈనెల 15 వరకు తెరిచి ఉంటుంది.

చంద్ర కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర అవనిగడ్డ : ఆర్థిక ఇబ్బందులతో కుమారుడు హాస్టల్ ఫీజు చెల్లించలేని పరిస్థితిలో ఆత్మహత్య చేసుకున్న చల్లపల్లికి చెందిన సిటీ కేబుల్ రిపోర్టర్ కళ్ళేపల్లి చంద్ర కుటుంబానికి ఎ.పి ప్రైవేటు స్కూల్ అసోసియేషన్ (అప్సా) అవనిగడ్డ దివి డివిజన్ ద్వారా 25 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం నవజీవన్ స్కూల్ నందు జరిగిన కార్యక్రమంలో అప్సా గౌరవ అధ్యక్షులు కొండవీటి ఈశ్వరరావు అధ్యక్షులు వి శివనాగరాజు, కార్యదర్శి కొమ్మూరి వెంకటేష్ లు అవనిగడ్డ ప్రెస్‌క్లబ్ అధ్యక్ష కార్యదర్శి అయిన అప్పికట్ల శ్రీనివాసరావు, పుట్టి శ్రీనివాసరావు లకు అందచేశారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ చంద్ర కుటుంబానికి గతంలో అసోసియేషన్ ద్వారా 12 వేల రూపాయలు అందచేయడం జరిగిందని, వీటితో కలుపుకుని మొత్తం 37 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా ఆ కుటుంబానికి అందచేసినట్లు అయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో అప్సా నాయకులు పంద్రాజు లంకమ్మ ప్రసాద్, ఆకుల శేషుబాబు, దుట్టా ఉమామహేశ్వరరావు లు పాల్గొన్నారు. చంద్ర కుటుంబానికి మాదివాడ శ్రీనివాసరావు (హోటల్ శ్రీనివాసరావు) 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని ప్రెస్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులకు అవనిగడ్డ ప్రెస్ క్లబ్‌లో అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు కోట సుబ్బారావు, కోట యూరిగగారిన్, చందు శ్రీనివాసరావు, అలపర్తి గోపాలకృష్ణ, సింహాద్రి జయరామ్, మునేశ్వరరావు లు పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం



విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : నిరుపేదకు కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డా. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంపై రూపొందించిన కరపత్రాలను ప్రతి ఇంటికి పంపిణీ చేసి పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు తెలిపారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఉచితంగా వైద్య పొందటం ఎలా కర పత్రాలను శుక్రవారం కలెక్టర్ స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేద బలహీన వర్గాల వారికి నాణ్యతతో కూడిన మెరుగైన కార్పోరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. జిల్లాలో 49 ప్రైవేట్ కార్పోరేట్ ఆసుపత్రులతో పాటు గ్రామీణ పట్టణ హెల్త్ క్లినిక్‌లు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ఏరియా ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, జనరల్ ఆసుపత్రుల్లో 3,257 వైద్య సేవలను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సహకారాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఆరోగ్యశ్రీ పథకంపై పూర్తి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన ప్రతి ఒక్కరు వైద్య సహాయం పొందెందుకు ఆసుపత్రుల్లో ఆరోగ్య మిత్రను కలిసి రిజిస్ట్రేషన్ ప్రక్రియ నుండి డాక్టర్, నర్సింగ్ సేవలు, వైద్య పరీక్షలు, ఉచిత పరీక్షలు, శస్త్రచికిత్సలు, అల్పాహారం, భోజనం సదుపాయాలను వినియోగించుకుని చికిత్స అనంతరం తిరిగి ఇంటికి చేరే వరకు అయ్యే ఖర్చు, ఆరోగ్య ఆసరా సేవలకయ్యే ఖర్చు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందనే సమాచారాన్ని తెలపాలన్నారు. ఆరోగ్యశ్రీ కింద పొందిన చికిత్సలు, చేసిన వైద్య పరీక్షలు ప్రభుత్వం ద్వారా నెట్ వర్క్ ఆసుపత్రికి జమ చేసిన మొత్తం వివరాలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ యాప్ ద్వారా పొందుపర్చిన సమాచారాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవచ్చనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ పథకం సేవలు సంతృప్తి కరంగా లేకపోతే 104 ద్వారా ఫిర్యాధు చేసి తక్షణమే పరిష్కరించుకునే అవకాశంపై, ఆసుపత్రుల్లో ఆరోగ్యమిత్ర, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది డబ్బులు అడిగితే 14400 నెంబర్‌కు ఫిర్యాదు చేసే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్న సమాచారాన్ని కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించాలని జిల్లా వైద్యాధికారులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ డా.పీ.సంపత్ కుమార్, సబ్ కలెక్టర్ అదితి సింగ్, డీఎం అండ్ హెచ్‌వో డా.సుహాసిని, డా.వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేట్ సుమన్, కనకదుర్గమ్మవారి దేవస్థానం ఈఓ రామరావు, టీమ్ లీడర్లు రవికుమార్, ఆశ్విని, శివరామప్రసాద్, శ్యామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రీన్ మొబిలిటీపై ఎస్ఎఐసీమోటార్, జెఎస్డబ్ల్యూ గ్రూప్ జాయింట్ వెంచర్

విశాలాంధ్ర -విజయవాడ లబ్బీపేట : ఎస్ఎఐసి మోటార్, ప్రముఖ ప్రపంచ వ్యాపార సమ్మేళనాల్లో ఒకటైన జెఎస్ డబ్ల్యూ గ్రూప్ వ్యూహాత్మక జాయింట్ వెంచర్లోకి ప్రవేశించినట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. లండన్లోని ఎంజి కార్యాలయంలో వాంగ్ జియావోకియు, ప్రెసిడెంట్,ఎస్ఎఐసి పార్థ్ జిందాల్, జెఎస్డబ్లు గ్రూప్, షేర్ హోల్డర్ ఒప్పందం షేర్ కొనుగోలు అండ్ షేర్ సబ్‌స్క్రిప్షన్ ఒప్పందంపై సంతకం చేశారన్నారు. వాంగ్ జియావోకియు ప్రెసిడెంట్,ఎస్ఎఐసి మోటార్ మాట్లాడుతూ "ఆటోమొబైల్ వ్యాపారం ఒక ప్రపంచ పరిశ్రమ ఇతర సారూప్యపరిశ్రమల మాదిరిగానే, ప్రాప్యత, సహకారం దాని ఆరోగ్యకరమైన వృద్ధికి కీలకమన్నరు. జెఎస్డబ్లూను తమ ఎంపిక భాగస్వాములుగా ఎంచుకున్నందుకు మేము ఎస్ఎఐసి ఎంజి మోటార్లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామన్నారు. భారతదేశపు అతిపెద్ద ఆటోమొబైల్ కంపెనీలలో ఒకదానిని నిర్మించడానికి ఎదురుచూస్తున్నామని తెలియజేసారు. ఎస్ ఏ ఐ సిలో బలమైన ప్రపంచ భాగస్వామితో కలిసి ఈ బ్రాండ్ కంపెనీని ముందుకు తీసుకెళ్లగలగడం నిజంగా గౌరవమన్నారు.

బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ అవినీతిపై విచారించాలి

- పోతిన మహేష్ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అవినీతి పై విచారణ చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన వెంకట మహేష్ అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ఏపీ బేవరేజెస్ కార్పోరేషన్ ఎండీ వాసుదేవరెడ్డి అవినీతి అనకొండలా మారిందన్నారు. వంద కోట్లు అక్రమంగా దోచుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారన్నారు. ఆయన చేసిన అవినీతి, దోచుకున్న వందల కోట్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వాసుదేవరెడ్డి బెవరేజెస్ ఎండీగా 2019 నుంచి బాధ్యతలు స్వీకరించారని, మద్యం దుకాణాల్లో సెక్యూరిటీ గార్డును నియమించి 11వేలు జీతంగా నిర్ణయించారన్నారు. 2,934 షాపులకు సెక్యూరిటీ గార్డులను నియమించాల్సి ఉండగా 1400షాపులకు మాత్రమే నియమించారని తెలిపారు. ఈ నాలుగేళ్లుగా 1500 షాపులకు గార్డులు ను నియమించకండా 80కోట్లు ఓపీయస్ సెక్యూరిటీ ద్వారా దోచుకున్నారన్నారు. 2934 మంది టెండర్లు పిలిచి 1400 మందికి మాత్రమే జీతాలు చెల్లించేది వాస్తవం అన్నారు. ఓపీడీయస్ సెక్యూరిటీ సంస్థ ద్వారా జరిగిన వాసుదేవరెడ్డి అవినీతిపై విచారణ చేయాలి ఓపీడీయస్ సంస్థ జియస్టీ ఎగ్గొట్టిన డబ్బు 130 కోట్లు ఓపీడీయస్ సెక్యూరిటీనే నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించారని చెప్పారు. ఈ ఏడాది బాలాజీ సెక్యూరిటీ సర్వీసెస్ అనే బినామీ సంస్థకు కాంట్రాక్టు కట్టబెట్టి రూ.80 కోట్లు అయాచితంగా వాసుదేవరెడ్డి లబ్ది పొందారని చెప్పారు. ప్రభుత్వ మద్యం దుకాణంలో మ్యాన్ పవర్ కూడా ఇతనే సప్లై చేశాడని, ఈ సంస్థ కూడా జీయస్టీ 80కోట్లు ఎగ్గొట్టారని, బ్లాక్ లిస్టులో పెట్టాల్సిన సంస్థకు టెండర్ ఎలా ఇచ్చారో సమాధానం చెప్పాలన్నారు. ప్రతి వైన్ షాపులో అట్టపెట్టెలు అమ్మే కాంట్రాక్టు వేరే వాళ్లకి అప్పగించి రూ. 20కోట్లు కొట్టరన్నారు. వాసుదేవరెడ్డి మాత్రం అట్టపెట్టెలను కిలో 2.25 రూపాయలుకే కాంట్రాక్టు ఇచ్చారు దీని వల్ల ఒక్కో జిల్లా నుంచి ఏడాదికి రూ. 20 లక్షలు ఇచ్చేలా వాసుదేవరెడ్డి ఒప్పందం చేసుకున్నారు ఈ నాలుగేళ్లల్లో మొత్తం వంద కోట్లు వాసుదేవరెడ్డి అవినీతి జరిగిందన్నారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సి బ్యాంక్, విశ్వభారతి కాలేజీ & లైఫ్ స్కిల్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక హెచ్ డి ఎఫ్ సి బ్యాంకు, విశ్వభారతి కాలేజ్ మరియు లైఫ్ స్కిల్స్ ఆధ్వర్యంలో రక్త దాన శిబిరాన్ని శుక్రవారం విశ్వభారతి కళాశాల లో ఏర్పాటు చేసారు. ముఖ్య అతిథులుగా కళాశాల యాజమాన్యం రంగాపురం నరసింహారావు, పెనుగొండ రాజీవ్, ప్రిన్సిపాల్స్ అబ్బులు మరియు రమేష్ ల చేతుల మీదుగా ఈ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు . ఈ రక్తదాన శిబిరంలో బ్యాంక్ సిబ్బంది మరియు విశ్వ భారతి , లైఫ్ స్కిల్స్ కాలేజీ విద్యార్థులు రక్తదానం కార్యక్రమంలో పాల్గొని 60 యూనిట్స్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీకాంత్, విశ్వ భారతి కాలేజ్ ప్రిన్సిపల్ తిరుపతి రావు, మరియు లైఫ్ స్కిల్స్ ఒకేషనల్ కాలేజ్ ప్రిన్సిపాల్ ,వెంకటేశ్వర రాజు మరియు గవర్నమెంట్ హాస్పిటల్ బ్లడ్ స్టోరేజ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : పట్టణంలోని డివిఆర్ నగర్ లో ఉన్న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం జన శిక్షణ సంస్థ సౌజన్యంతో ఐద్వ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ కార్యక్రమం శుక్రవారం జన శిక్షణ సంస్థ డైరెక్టర్ ఎ పూర్ణిమ ప్రారంభించారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలబడాలంటే ఒక పనితో పాటు మరెన్నో పనులు చేయాల్సి ఉంటుందన్నారు. మహిళలు సంపాదించే ప్రతి రూపాయి వారి బిడ్డలకు ఉపయోగపడుతుందని, కుటుంబ పోషణలో మహిళలు కూడా భాగస్వామి కావాలని కోరారు. ఐద్వా జిల్లా నాయకులు సోమోజు నాగమణి మాట్లాడుతూ ఇప్పుడున్న ఆర్థిక పరిస్థితులలో కుటుంబాన్ని నడుపుకొనుటకు అనేక ఇబ్బందులు పడుతున్న రీత్యా మహిళలు వారికి చేయూతనివ్వటానికి తన సంపాదన తన కుటుంబానికి ఆధారపడాలని మహిళలను చైతన్య పరచి ఐద్వా ఆధ్వర్యంలో కుట్టు మిషన్, బ్యూటీషియన్ కోర్సులు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో కుట్టుమిషన్ శిక్షకురాలు వి మాధవి, బ్యూటీషియన్ శిక్షకురాలు బి శారద, మహిళలు నాగరాణి, నాగలక్ష్మి, బూచమ్మ తదితర మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం

విశాలాంధ్ర - జగ్గయ్యపేట : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా జగ్గయ్యపేట ప్రభుత్వ హస్పటల్ నందుశుక్రవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా జడ్జి శోభారాణి పాల్గొని ఎయిడ్స్ పై అవగాహన కల్పించారు. అనంతరం జండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్పై రామారావు, మెడికల్ ఆఫీసర్ హరీష్, కన్వీనర్ సుజాత, తిరుమల్ రావు హాస్పిటల్ కమిటీ చైర్ పర్సన్ హరిబాబు, రవి, రుక్మిణి, కృష్ణవేణి, వెంకటరమణ స్వచ్ఛంధ సంస్థ శ్రేయస్సు సిబ్బంది, ఆశ వర్కర్లు , నర్సింగ్ స్టూడెంట్స్ తదితరులు పాల్గొన్నారు.

అఖిల భారత రైల్వే బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో కాంస్యం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : అఖిల భారత రైల్వే బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో డివిజనల్ ఉద్యోగి కాంస్య పతకాన్ని సాధించారు. విశాఖపట్నంలో నవంబర్ 22 నుండి 24 వరకు జరిగిన ఆల్ ఇండియా రైల్వే బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో గూడూరులోని సాంకేతిక నిపుణుడు ఎం.రవీంద్రబాబు కాంస్య పతకాన్ని సాధించారు.ఈయన దక్షిణ మధ్య రైల్వే బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు.ఛాంపియన్‌షిప్‌లలో ఎస్సీ రైల్వే జట్టు మూడవ స్థానాన్ని సాధించింది. ఈ సందర్భంగా డిఆర్ఎం నరేంద్ర ఎ. పాటిల్, ఏడిఆర్ఎంలు డి. శ్రీనివాసరావు(ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), ఎమ్.శ్రీకాంత్(ఆపరేషన్స్) శుక్రవారం డిఆర్ఎం ఛాంబర్‌కు రవీంద్ర బాబును పిలుపించుకుని అభినందించారు. జాతీయ రైల్వే ఛాంపియన్‌షిప్‌లో దక్షిణ మధ్య రైల్వేకు కాంస్య పతకాన్ని సాధించడంలో అతని అత్యుత్తమ ప్రదర్శన భవిష్యత్తులో మరింతగా ఉండాలని అందుకు కావలసిన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

బెల్లంకొండ వినయ్ కుటుంబానికి వైయస్సార్ బీమా ఆసరా

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): అనారోగ్యంతో చనిపోయిన పేద కుటుంబాలకు వైయస్సార్ బీమా ఆసరాగా నిలుస్తుందని 47 డివిజన్ కార్పొరేటర్ గోదావరి గంగా అన్నారు. డివిజన్ పరిధిలోని లక్ష్మయ్య వీధిలో బెల్లంకొండ వినయ్(44) అనారోగ్యంతో బుధవారం రాత్రి మరణించారు. రాడ్ బెండింగ్ పని చేసుకునే వినయ్ కు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గురువారం మట్టి ఖర్చుల నిమిత్తం వారి కుటుంబానికి రూ 10వేలు నామిని అయిన అయన భార్య బెల్లంకొండ హరిప్రియకు అందజేయడం జరిగింది. వైయస్సార్ బీమా కింద మిగిలిన రూ 90 వేలు నగదు త్వరలో హరిప్రియ బ్యాంకు ఖాతాకి జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సింహాచలం దేవస్థానం ట్రస్టీ కూరాకుల నాగ, రాష్ట్ర వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బోయిళ్ల రాజేష్, 146 సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ శ్రీనివాస్ వాలంటరీ రమ పాల్గొన్నారు.

వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : విజయవాడ నగర వ్యాప్తంగా రోడ్డు ప్రక్కన వ్యాపారాలు నిర్వహిస్తున్న వీధి వ్యాపారులను సర్వే చేయాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ స్ట్రీట్ వెండర్స్ ఆఫ్ ఇండియా కోఆర్డినేటర్ రాజు మున్సిపల్ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. శుక్రవారం గాంధీనగర్ లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భరోసా లేని వీధి వ్యాపారులు ఒక అభద్రతలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.నగర వ్యాప్తంగా సుమారు 10 నుండి 15 వేల మంది వీధి వ్యాపారులు ఉన్నారన్నారు.ఆరుగాలం కుటుంబం యావత్తు రోడ్డు ప్రక్కన వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్న వీధి వ్యాపారుల స్ట్రీట్ వెండర్స్ పరిరక్షణ చట్టం 2014 ప్రకారం ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి సర్వే నిర్వహించాల్సి ఉండగా నగరపాలక సంస్థ పరిధిలో సర్వే జరగలేదన్నారు.సర్వే చేసినట్లు అయితే వారికి చట్టపరమైన అన్ని సౌకర్యాలు లభిస్తాయి అన్నారు. వ్యాపారానికి అవసరమైన పెట్టుబడి సహాయం బ్యాంకుల నుండి రుణ సదుపాయం వెండర్స్ పొందే అవకాశం ఉంటుందన్నారు. విజయవాడ హాకర్స్ యూనియన్ నాయకులు చౌదరి మురళి మాట్లాడుతూ మునిసిపల్ ఉన్నతాధికారులు చట్టబద్ధంగా తమకు కల్పించాల్సిన గుర్తింపు కార్డులు, వెండింగ్ లైసెన్సులు ఇవ్వడం ద్వారా వారి జీవన శైలి మెరుగు పడుతుందన్నారు.తమ పిల్లల ఉన్నత చదువులకు వ్యాపార అభివృద్ధి ఉపయోగపడుతుందన్నారు.బీసెంట్ రోడ్డు హాకర్స్ యూనియన్ నాయకులు దామోదర్ రావు,కుమార్ లు సంయుక్తంగా మాట్లాడుతూ వీధి వ్యాపారులు బ్రతుకకు,వారి వ్యాపార భద్రతకు ప్రభుత్వం ఏ విధమైన ధైర్యం ఇవ్వడం లేదన్నారు.శానిటేషన్ ఇతర పోలీస్ అధికారులు వీధి వ్యాపారులను వేధించడం నిత్య కృత్యమైపోయిందని వారు తెలిపారు. ఈ పరిస్థితి పోవాలంటే మున్సిపల్ ఉన్నతాధికారులు, చట్టాన్ని సమగ్రంగా అమలు చేసి వీధి వ్యాపారులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని వారి డిమాండ్ చేశారు ఈ సమావేశంలో నాస్వి ప్రతినిధి ప్రసన్న దత్త ఇంకా భీమేశ్వరరావు, సూరమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రమోహన్‌కు సినీ స్వర నీరాజనం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని, జి ఆర్ కె పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి ప్రసిద్ధ చలన చిత్ర నటుడు చంద్రమోహన్ కు నీరాజనాలర్పిస్తూ సాగింది. గాయనీ గాయకులుగా పావని, శ్రీ దుర్గా నాగమణి, మల్లేశ్వరి, భార్గవి, షబానా, శ్యాంప్రసాద్, డేవిడ్ రాజు, చంద్రశేఖర్, డేనియల్, మస్తాన మస్తాన్ వలి, సుదర్శన్ రాజు లు చంద్రమోహన్ నటించిన పలు చిత్రాలలోని బాబా సాయిబాబా, సీతాలు సింగారం, మావిచిగురు తినగానే, ఝుమ్మంది నాదం, సామజవరగమన, నడిరేయి ఈ జాములో వంటి ఇత్యాది పాటలను హృద్యంగా పాడి వినిపించారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. ఎదురుగా అతిథులుగా గోళ్ళ నారాయణరావు, శింగంశెట్టి పెద్ద బ్రహ్మం, డాక్టర్ చెట్లపల్లి మారుతి ప్రసన్న తదితరులు పాల్గొని కళాకారులను అభినందిస్తూ చంద్రమోహన్ నటవైదుశ్యాన్ని కొనియాడుతూ ప్రసంగించారు.

ఎయిడ్స్‌పై అవగాహనకు బహిరంగ చర్చ అవసరం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : ఎయిడ్స్ నియంత్రణకు బహిరంగ చర్చ అవసరమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే స్టేడియం నుండి నిర్వహించిన అవగాహన ర్యాలీని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని, వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు తోడు స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యం వల్ల వ్యాధి గ్రస్తుల సంఖ్య తగ్గుముఖం పట్టడం శుభ పర్న్ పరిణామన్నారు. లైంగిక జీవనంలో అడ్డదారులు తొక్కడం వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని, ముఖ్యంగా ఎయిడ్స్ వ్యాధి బారిన పడి అనేక మంది జీవితాన్ని కోల్పోతున్నారన్నారు. కండోమ్స్ వాడకం వల్ల ఎయిడ్స్ వ్యాధి బాధితుల సంఖ్య గనసీయంగా తగ్గుముఖం పట్టిందని, షాపింగ్ మాల్స్, రైల్వే స్టేషన్లు, బస్టాండులు వంటి రద్దీ ప్రాంతాల్లో కండోమ్స్‌ను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య రంగ నిపుణులు వైద్య కృషి ఫలితంగా కొన్ని మందులు అందుబాటులోకి రావడంతో ఎయిడ్స్ నియంత్రణ జరిగి రోగులు సాధారణ జీవితాన్ని గడిపేలా వీలుకలిగిందన్నారు. మానవ నైజాన్ని మార్చుకుని క్షణికానందం కోసం అసాంఘీక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. తెలియని వ్యక్తులతో లైంగిక కార్యకలపాలకు పాల్పడరాదని, తల్లిదండ్రులు చేసిన తప్పిదాల వల్ల వారి నుండి అభంశుభం తెలియని చిన్నారులకు వ్యాధి సోకడం బాధకరమన్నారు. జిల్లాలో సుమారు 17 వేల మందికిపైగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాది,గ్రస్తులను గుర్తించడం జరిగిందన్నారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల సంఘీభావం తెలిపి వారికి పౌష్టికాహారం మందులను అందించి జీవన ప్రమాణాలను పెంచేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను ఆదుకునేందుకు ముందుకు వచ్చే స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వ పరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డీడీ డా.రాజేంద్రప్రసాద్, ఏపీడీ డా.కోటేశ్వరి, జేడీ డా.కామేశ్వర ప్రసాద్, డా.మంజుల, డా.సుబ్రహ్మణ్యం, పెఫార్ కో-ఆర్డనేటర్ డా.రాజేంద్ర ప్రసాద్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా.సుహాసిని, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణ ఉషారాణి పాల్గొన్నారు.